# పడిలేచిన కెరటం

## - గంటి భానుమతి



(ప్రారంభం)

" **మీతో మాట్లాడాలి.**" కాలేజీ లైబ్రేరీలో చేస్తున్న పనిని ఆపి తలెత్తి , ఎదురుగా నుంచున్న మనిషిని ఆశ్చర్యంగా చూసింది శృతి.

ఆమె ఎదురుగా నుంచున్నది ఎవరో కొత్త మనిషి కాదు. రోజుకి ఓ సారైనా లైబ్రేరీకి వస్తాడు. పలకరిస్తాడు. జనరల్ గా పుస్తకాల గురించి, కలల గురించి, నిజాలు, నమ్మకాలు, ఆశలు గురించి, అద్భుతాల గురించి, కాలంలో కరిగిపోతున్న మనుషుల గురించి, తీసుకెళ్ళిన పుస్తకాల గురించి ,ఓ భావుకుడిలాగా,ఓ విమర్శకుడిలాగా చెప్తాడు. అతని మాటల్లో ఆకర్షణ ఉంటుంది. ఆమె మంత్ర ముగ్ధురాలిలాగా వింటూంది. అలా ఏదో ఒకటి మాట్లాడే మానవ్, రోజూ కనపడే మానవ్. ఇవాళ కొత్తగా మీతో మాట్లాడాలి అంటూంటే శృతికి ఆశ్చర్యం అనిపించింది.

" రోజూ మాట్లాడుతూంటారు కదా , ఏంటీ ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నారు మాట్లాడాలి అని . మాట్లాడండి. అద్దేం ఉంది " అంది నవ్వుతూ.

"ఇక్కడ కాదు. వేరే చోట ఎక్కడైనా" అంటూ ఆమె కళ్ళల్లోకి చూసాడు.

ఆ చూపుల్లోని తేడాకి శృతి కలవర పడింది. వెంటనే చూపులు తిప్పుకుంది. ఆలోచనలో పడింది. ఎక్కడో మాట్లాడాల్సిన విషయం ఏం ఉంటుంది.?

"సారీ. మానవ్ . మీరు ఏది మాట్లాడాలనుకున్నా ఇక్కడే మాట్లాడండి"

" కానీ ఇది లైబ్రేరీ కదా. ఎవరైనా రావచ్చు."

" ఇప్పుడు ఎవరూ రారు. పరవాలేదు.చెప్పండి. "చేతిలోని పుస్తకానికి పేజీ గుర్తుగా అక్కడే ఉన్న మార్కర్ ఉంచింది.

కొంచెం అటూ ఇటూ చూసి గొంతు సవరించుకున్నాడు.

" మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను." గబగబా అప్ప చెప్పాడు.

ఉలిక్కి పడింది. పెళ్ళా! ఆ పదాన్ని మర్చిపోయి చాలా రోజులైంది. ఆ పదాన్ని వాడిన మానవ్ ని ఒక్కసారి చూసింది.

వెంటనే జవాబివ్వలేదు. జవాబివ్వలాంటే , ఎంతో ఆలోచించాలి. ఎన్నో ఆలోచించాలి. ఎన్నింటినో గుర్తు తెచ్చుకోవాలి. పాత పుస్తకం లోని చాప్టర్ల లోకి తొంగి చూడాలి. అన్నింటి కన్నా పెళ్ళి. గురించి. ఆ పదం చాలా రోజుల తర్వాత వింటూంటే,కొత్తగా అనిపిస్తోంది.

నిజానికి ఆ పదాన్ని మర్చిపోయింది. ఇప్పుడు మానవ్ అంటూంటే ఎక్కడో జ్ఞాపకాల పొరల్లోంచి ఎన్నింటినో చీల్చుకుంటూ ఆ పదం పైకి వచ్చింది.

ఈ మానవ్ తన గత జీవితాన్ని చూడడానికి ప్రయత్నిస్తున్నాడు. మరోసారి ,మరోవ్యక్తి. తన జీవితంలోకి అతి దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తున్న వాడు. మొదట ఆర్ణవ్, వంశీ,ఇప్పుడు ఈ మానవ్.

ఆలోచించాలి, దాని గురించి ఇంత వరకూ ఆలోచించాలనిపించలేదు, ఇప్పుడు ఆలోచించాలి. ఎదురుగా ఉన్న మానవ్ అడిగే సరికి ఇప్పుడు ఆలోచించాలి. పెళ్ళి చేసుకోవాలా వద్దా, అని.అడుగడుగునా మొలుస్తున్న ప్రశ్నలు,వాటిని కలుపు మొక్కల్లా పీకి పారేయ్యాలి.

అలా ఆలోచించే ముందు తన గురించి మానవ్ కి చెప్పాలా వద్దా అన్న దాని గురించి కూడా ఆలోచించాలి. ఇంత వరకూ తన గతం గురించి, ఎడారి లాంటి గతం గురించి, ఎవరికీ చెప్పుకునే పరిస్థితి రాలేదు. ఆ జ్ఞాపకాలు ఒయాసిస్ కాదు,సెద తీర్చేవి కాదు.,గాలివానలకి రెపరెపలాడే చిగురాకులు. అందుకే వాటిని తలుచుకోడానికి ఇష్టపడదు.

" ఏం అంటారు ? " తలని బాగా వొంచి, ఆమె మొహం లోకి చూస్తూ అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది. ఏం అంటారు అని అడుగుతూంటే అసలు తన గురించి ఏం తెలుసని ఆ నిర్ణయానికి వచ్చాడు.

" నాకు పెళ్ళి చేసుకునే ఉద్దేశం లేదు.మీ మనసులోంచి ఆ అభిప్రాయం తీసేయండి " అని తలవంచుకుని టేబుల్ మీద ఉన్న పుస్తకాల దొంతరపైనున్న పుస్తకాన్నితీసి, టైటిల్ ని ఇంకా వివరాలని కంప్యూటర్ లో ఎక్కించింది.

" మీరు ఆలోచించుకోండి వెంటనే చెప్పాలని ఏం లేదు " అని లేవబోయాడు.

" ఆలోచించుకోవాల్సింది ఏం లేదు. సారీ. నాకు పని ఉంది. " మీరెళ్ళండి అని డైరెక్ట్ గా చెప్పలేక పోయింది.

" ఓకే " అని అప్పటికి వెళ్ళిపోయాడు. కాని మర్నాడు అదే సమయానికి వచ్చాడు. అదే మాట.

" అసలు నా గురించి మీకేం తెలుసు, ఏమీ తెలీదు. అలాంటప్పుడు ఏం చూసి చేసుకుంటానని అంటున్నారు ? "

"నాకు తెలిసినంత వరకూ మీరు నాకు అర్థం అయ్యారు. నాకు నచ్చారు. అది చాలు నేను మిమ్మల్ని ఇష్టపడడానికి "

" సారీ, అది చాలదు. మీకు నా గురించి ఏమీ తెలీదు. తొందరపడి అంత పెద్ద నిర్ణయాలు తీసుకోవద్దు. ఇలా అప్పుడప్పుడు కలుసుకోవడం మాట్లాడుకోవడం వల్ల పైకి కనిపించేవి మాత్రమే తెలుస్తాయి. కానీ లోతైన విషయాలు తెలీదు పైగా మన మధ్య ఏం అంత పెద్ద స్నేహం కూడా లేదు "

" కానీ ఆ స్నేహం చాలు ఒకరి గురించి తెలుసు కోడానికి. పెళ్ళవుతే " అంటూ ఆగి శృతిని చూసాడు.

"ముందు ఇది చెప్పండి,అసలు పెళ్ళి అనేది ఎందుకు చేసుకుంటారు ? "

“ అదేం ప్రశ్న. ఎందుకంటే ఏం చెప్తాను, అది ఓ సంస్థ. ఓ వ్యవస్థ. అందులోకి ప్రతీవ్యక్తి వెళ్లాలి అని అనుకుంటారు . దానికి కారణాలు ఎన్నో ఉంటాయి.వంశవృద్ధి చేసుకోడానికో, తోడు కోసమో, సామాజిక కారణాల మూలంగానో , ఇంటిపరిస్థితుల మూలంగానో, శారీరక సుఖాల కారణంగానో, కారణం ఏదైనా కావచ్చు కానీ నేను మాత్రం మిమ్మల్ని ఇష్టపడుతున్నాను. అందుకని అడుగుతున్నాను ”

“ సరే. మీరే అన్నారు అది ఓ వ్యవస్థ అని . ఆ వ్యవస్థకి స్త్రీ పురుషులిద్దరూ రెండు అంగాల్లాంటి వాళ్ళు. ఒప్పుకుంటారు కదా. అంటే ఇద్దరూ ఉండాల్సిందే. అప్పుడే అది సంపూర్ణం అవుతుంది. అలాంటి వ్యవస్థలోకి వెళ్తున్నప్పుడు,ఎన్నో చూడాలి. ఎందుకంటే వాటి ప్రభావం ఎప్పుడూ మనిషి మీద ఉంటుంది.”

“ నాకు ఆ లోతైన విషయాలు అక్కర్లేదు ”

ఎంత సులభంగా అనేసాడు ఆ విషయాలు ఏవీ అక్కర్లేదని. అయితే పెళ్ళికి ఈ రెండేళ్ళ పరిచయం సరిపోతుందా! మరోసారి స్నేహం మీద నీడలు పడుతున్నాయి.

ఎప్పటికీ సమాధానం రాక పోయేసరికి ,ఆమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్నాడు.

“ నా గురించి అనుమానాలున్నాయా , నా చదువు,ఉద్యోగం అన్నీ మీకు తెలుసు. నేను సంపూర్ణ ఆరోగ్య వంతుడిని. మీకు ఆ విషయంలో సందేహంఉందేమో! “ కొంచెం సేపు ఆలోచించి అన్నాడు.

“ మీరు కావచ్చు, కానీ నేను కాదు ” అని మానవ్ మొహం లోకి చూసింది.

“ అంటే ? “ఆశ్చర్యంగా చూసాడు.

“ అందుకే అన్నాను, నా గురించి మీకు ఏం తెలీదని. నేను ఓ రెండేళ్ళు మానిక్ డిప్రెషన్ లో ఉండిపోయాను. ఓ రెండు సార్లు ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసాను. ఓసారి నేను టెంత్ లో ఉన్నప్పుడు స్లీపింగ్ పిల్స్ తీసుకున్నాను. ఇంట్లో వాళ్ళు తొందరగా కనిపెట్టారు , దగ్గర్లో ఉన్న నర్సింగ్ హోం కి తీసుకెళ్ళారు. కాస్త సీరియస్ అయింది. ఆ తరవాత మరోసారి, అప్పుడే నేను ఓ ఆర్నెల్లు మెంటల్ హాస్పిటల్ లో ఉన్నాను. మరో ఆర్నెల్లు సైకియాట్రిస్ట్ ల పర్యవేక్షణలో ఉన్నాను. ”

అదే ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోని మానవ్ అలాగే శృతిని చూసాడు.

“ నమ్మడం లేదా! కానీ ఇదే నిజం. ”

మానవ్ ఓ నిమిషం ఏం మాట్లాడ లేదు. ఆమెనే చూస్తూండిపోయాడు.మనిషి మంచి రంగు. శిల్పి చెక్కినట్లుగా ఉంటే చక్కని ఆకారం . పొందికగా ఉండే వస్త్రధారణ,వీటన్నిటికీ మించి ఓ రెండు డిగ్రీలు, మరో రెండు డిప్లొమాలు, ఇవి కాకుండా ఆమె మంచి చిత్రకారిణి, రచయిత్రి. ఇవన్నీ ఆమె సొంతం. అలాంటి ఈమె మెంటల్ హాస్పిటల్ లో ఉందా ! నమ్మాలనిపించలేదు.

“ నేను నమ్మను. నేను ఇన్ని రోజులుగా చూస్తున్నాను, మీలో నాకు ఏం తేడా కనిపించ లేదు. నేను ప్రపోజ్ చేసానని, నన్ను పెళ్ళి చేసుకోడం ఇష్టం లేక అలా అంటున్నారా? ”

" ఇష్టం లేకపోతే ఇష్టం లేదనే చెప్తాను, అబద్ధం ఎందుకు చెప్తాను? మీకు నిజమే చెప్పాను. ఓ పదేళ్ళ క్రితం నేను బీఎస్సీ ఫైనలియర్ లో ఉన్నప్పుడు డిప్రెషన్ తో బాధ పడ్డాను. అప్పుడు ఆసుపత్రిలో ఉన్నాను. అప్పటి నుంచి మందులు వాడుతున్నాను. వాటిని మధ్యలో మానేయడానికి లేదు. జీవితాంతం మందులు వాడాల్సిందే "

"అంతే కదా, అది పెద్ద సీరియస్ విషయం కాదు, మా పేరెంట్స్ ఇద్దరికీ బీపీ షుగర్ ఉన్నాయి. వాళ్ళు కూడా మందుల్ని జీవితాంతం వాడాలని అంటారు. మధ్యలో మానేయడానికి వీల్లేదుట . అయినా ఈ డిప్రెషన్ నుంచి బయట పడిన వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. ఉదాహరణలు ఇవ్వనా?"

" అక్కర్లేదు. పైగా అదీ ఇదీ ఒకటి కాదు. ఎందుకు కాదో మీకు తెలియాలి. అంటే నా గురించి నీకు తెలియాలి. ఇంత వరకూ నా పర్సనల్ విషయాలు నేనెవ్వరికీ చెప్పలేదు. అలా చెప్పుకోడానికి సిగ్గు పడక్కర్లేదని నన్ను ట్రీట్ చేసిన డాక్టరు గారు అన్నారు. అయినా ఇంత వరకూ ఆ అవసరం రాలేదు. కానీ ఈ రోజున మీరు అడిగారు, దానికి సమాధానంగా చెప్పాల్సి వస్తోంది. ఇప్పుడు చెప్పక పోతే మరోసారి నన్ను అడిగే అవకాశం ఉంది. ఇప్పుడు మీరు అక్కర్లేదు ఆ అవసరం లేదు అని అన్నా కానీ మీరు తెలుసుకోవాలి. మీరు నాగురించి, నా గతం గురించి ఏం తెలీకుండా పెళ్ళి గురించి మాట్లాడకూడదు "

" సరే. మీరంతగా నేను వినాలని పట్టుబడుతున్నారు కాబట్టి, వింటాను. కాని ఒక్కటి గుర్తుంచుకోండి. మీ గతం గురించి తెలుసుకోవాలని, నాకేమాత్రం ఉత్సాహం , ఆసక్తి లేదు "

"అంటే గతం చెప్పకుండానా? అది నాకిష్టం లేదు. గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్లుంటుంది "

" ఇదో పెద్ద రోగం అని అనుకోను. ఎంతో మంది మానసికంగా బాధ పడిన వాళ్లున్నారు. ఎక్కువ బాధలు పడ్డ వాళ్ళు కూడా ఉన్నారు. ఎటువంటి లోతైన గాయం అయినా ఏదో ఓ రోజున మానిపోతుంది. ఇది ఇవల్యూషన్. నీ కన్నా ముందు ఎంతో మంది సినిమా వాళ్ళూ , ఆర్మీలో వాళ్ళూ, సైంటిస్ట్ లూ, పోటీ ప్రపంచంలో ఉన్న వాళ్ళూ డిప్రెషన్ తో బాధ పడ్డారు.ఇంకా ఇప్పటికీ ఉన్నారు. వాళ్ళంతా గతాన్ని తవ్వుకుంటూ కూచో లేదు. ఆ బలహీన క్షణాలని జయించడానికి బలమైన మార్గాలు వెతుక్కున్నారు. పెళ్ళిళ్ళు చేసుకున్నారు, పిల్లలు కూడా ఉన్నారు, ఇది పెద్ద సీరియస్ కాదు. మీరెన్ని చెప్పినా నా నిర్ణయం మారదు. ముందు ఇది చెప్పండి ఎక్కడ కలుద్దాం ? " అంటూ ఆమెని చూసాడు.

" ముందు నేను మానసికంగా చెప్పడానికి తయారయ్యాకా , అప్పుడు ఎక్కడ కలుసుకోవాలో ఆలోచించి చెప్తాను "

" అలాగే " అంటూ మానవ్ వెళ్ళి పోయాడు.

అతను వెళ్ళిన వైపే చూస్తూండిపోయింది. నిన్నటి వరకూ స్నేహితుడని అనుకుంది. కానీ ఇప్పుడు దాని అర్థం మార్చేసాడు. అది ఇప్పుడు ప్రేమ ,పెళ్ళికి మారి పోయింది. స్నేహం వేరు, ప్రేమ వేరు ఆ తేడా వాళ్ళకి తెలీడం లేదు. ప్రతీసారి,ఈ స్నేహం పెళ్లికి దారి తీయాలా! మొదటి సారి అర్ణవ్ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు మానవ్ .

ఇప్పుడు తన గురించి చెప్పకపోతే మానవ్ ని డార్క్ లో ఉంచినట్లవుతుంది. తన గురించి చెప్పాలంటే తన గతం చెప్పాలి . ఆ భయంకరమైన గతం చెప్పాలి. అందులో ముఖ్యమైనవాడు అర్ణవ్. అర్ణవ్ గురించి చెప్పాలి. ఆ ఛాప్టెర్ ముగిసిపోయింది. కానీ రెఫరెన్స్ కోసం

దాన్ని ఇప్పుడు చదువుకోవాలి. గతాన్ని గుర్తు పెట్టుకోక పోతే తిరిగి అనుభవించాల్సి వస్తుంది . ఏం చెయ్యాలో తెలియడం జ్ఞానం. ఏం చెయ్యకూడదో తెలియడం విద్వత్తు.

మానవ్ కి ఇప్పుడు చెప్పాలంటే ఎక్కడినుంచి మొదలెట్టాలి? తన జీవితంలో అలజడి ప్రారంభమైన దగ్గరి నుంచా? అవును అక్కడినుంచే మొదలెట్టాలి. ఆ రోజున జరిగినది జీవితంలో మలుపు తిప్పేసింది. అదే ఆరంభం,జీవితంలోని అల్లకల్లోలానికి ,పాతాళంలోకి దిగి పోడానికి ,ఎంత దిగాలో అంత కిందికి దిగిన రోజు,జారుడు మెట్లలా జారడం మొదలైన రోజు.

చిన్నగా నిట్టూర్చి,టేబుల్ మీద ఉన్న పుస్తకాలు సద్దుతూ ఎదురుగా ఉన్న కాలెండర్ ని చూసింది. శనివారం. ఇవాళ అనాధాశ్రమానికి వెళ్ళాలి. అక్కడ పిల్లలకి చెప్పాల్సిన కథల పుస్తకాలు తీసి పెట్టుకుంది. చిన్నప్పుడు పిల్లల పుస్తకాలు చదివే అవకాశం లేక పోయింది. అందుకే గులాబకావళి కోసం అడివి దారి పట్టిన యువకుల కథలు, వెళ్ళవద్దన్న ఉత్తర దిక్కుకి వెళ్ళి దారి తప్పిన రాకుమారుల కథలు, రాక్షసుడి చెరలో ఉన్న రాకుమార్తెను విడిపించి, పెళ్ళి చేసుకున్న విజయసింహుల కథలు,రాకాసి లోయలు, వజ్రాల దీవులు, ఇలాంటి అద్భుతమైన కథలున్న పుస్తకాలు చదవలేక పోయింది. ఇప్పుడు ఆ పిల్లలకి చెప్తూంటే తను కూడా ఓ చిన్న పిల్లై పోతోంది. మరోసారి బాల్యాన్ని అనుభవిస్తోంది. ఆ రోజు తను చదవాలనుకున్న పుస్తకం కూడా తీసి పక్కన పెట్టుకుంది. ప్రస్తుతం తనకి ఇదే కావాలి, డాక్టర్లు అన్నది కూడా ఇదే. ఏదో పని కల్పించుకోవాలి. మనసుని ఖాళీగా ఉంచద్దు. అందుకే అనాధాశ్రమానికి, వృద్ధాశ్రమానికి వెళ్ళి, వాళ్ళకి ఎన్నో విషయాల్లో సాయ పడుతోంది. వాళ్ళని చూస్తూంటే,అర్థం అవుతోంది,తను ఎన్నో విషయాల్లో అదృష్ట వంతురాలు అని. వాళ్ల కష్టాల ముందు ,వాళ్ళ ఇబ్బందుల ముందు తనకి బాధలు ఏం లేనట్టే .

మళ్లీ మానవ్ గుర్తొచ్చాడు.ఈ మానవ్ విషయం అమ్మకి నాన్నకి చెప్పాలా . చెప్పాలంటే ఎప్పుడు చెప్పాలి.కానీ బాగా ఆలోచిస్తే ప్రస్తుతానికి అనవసరం అనిపించింది.

ఆ మర్నాడు ఆదివారం ఉదయం మానవ్ కి ఫోన్ చేసి చెప్పింది,బంజారా హిల్స్ లో ఉన్న హోటల్ కి బ్రంచ్ కి రమ్మనమని.

ముందుగా అనుకున్నట్లుగా , పదకొండు గంటలకి శృతి,మానవ్ హోటల్లో కలుసుకున్నారు. లోపలికి వెళ్ళారు. ఆ హోటల్లోనే ఏవో రెండు కాన్ఫరెన్స్ లున్నట్లున్నాయి, ఆ బోర్డులు లోపలికి వెళ్ళే దగ్గర పెట్టే ఉన్నాయి.ఒకే రంగు సూటు వేసుకున్న ఓ పాతిక మంది డెలిగేట్స్ లా ఉన్నారు, వాళ్ళు ప్లేట్లు పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ కనిపించారు, అయినా ఖాళీ ఖాళీగానే కనిపించింది. ఈ మూల నుంచి ఆ మూల వరకూ ఉన్న రకరకాల టిఫెన్లు. అన్నీ ఓసారి చూసి, తినడానికి ఓ రెండు రకాలు, తాగడానికి పళ్ళ రసం తెచ్చుకుని ఎవరు లేని ఓ మూల టేబుల్ దగ్గర ఎదురెదురుగా కూచున్నారు. కాస్త తిన్నాకా తలెత్తింది శృతి. చెప్పండి అన్నట్లుగా ఆమె వైపు చూసాడు.

“ మొదటినుంచి అంతా వివరంగా చెప్పడం బోర్ గా ఉంటుంది.నా జీవితం ఎక్కడ మలుపు తిరిగిందో అక్కడినుంచే చెప్తాను ”

“ మీ ఇష్టం.ఎక్కడినుంచైనా మొదలు పెట్టండి. విండానికి నేను వింటాను ”

“ మా నాన్నగారికి , మేం ఉంటున్న ప్లేస్ నుంచి ఓ యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాదుకి ట్రాన్స్ ఫర్ అయింది. మేం మరో నాలుగు రోజుల్లో ఆ ఊరు విడిచి వెళ్ళిపోతున్నాం.

ఆరోజు నా కాలేజీకి ఆఖరి రోజు. నేను ఇంటికి వచ్చేస్తూంటే అందరం ఒకరికొకరం చిన్న చిన్న బహుమతులు ఇచ్చుకున్నాం. వాళ్ళ ఫోన్ నంబర్లు నాకు ఇచ్చారు. నేను హైద్రాబాదు వెళ్ళకా నా నంబరు ఇస్తానన్నాను. ఒకళ్ళకొకళ్ళం వీడ్కోలు చెప్పుకున్నాం ,భారంగా నేను మాఇంటి వైపుకి తిరుతూంటే, సువర్ణ నన్ను పిలిచి ఆపింది. చుట్టూ చూసాను. అప్పటికే అందరూ వెళ్ళిపోయారు, మేమిద్దరమే ఉన్నాం.

" నీతో కొంచెం మాట్లాడాలి " అంది నా ముఖంలోకి చూస్తూ.

నాకు తెలుసు ఆమె ఏం మాట్లాడాలనుకుంటోందో.

" ఆర్ణవ్ గురించి అయితే మాట్లాడాల్సిన పని లేదు. తనకి నేను చాలా సార్లు చెప్పాను .అర్థం చేసుకోలేకపోతే అది నా తప్పు కాదు " అని కోపంగా అన్నాను.

"అదే ఇదివరకూ చెప్పిందే మరోసారి చెప్పు. అదే మాట్లాడు. ఓ సారి ఫోన్ చెయ్యి. మాట్లాడితో అంతా క్లియర్ అయిపోతుంది. అయినా మన మనసు గురించి మనకి బాగా తెలియాలి. దానికి గాయం అయితే మందు ఎవరో వచ్చి రాయరు. మన గాయాలకి మనమే మందు రాసుకోవాలి.ఇతరులని వంచించడం ఈజీ, మనలని మనం వంచించుకోడం కష్టం "

నాకు అసలు అర్థం కాలేదు. మనసేంటీ, గాయం ఏంటీ ? మందులేంటీ? ఇలాంటి మాటలు ఎందుకు మాట్లాడుతోంది నేను వంచించడం ఏంటీ? అంటే నేను కూడా ఆర్ణవ్ ని ప్రేమించానని అనుకుంటోందా! అలా అని నేను చెప్పకుండా ప్రేమించినట్లు ఒప్పుకోడంలేదని అనుకుంటోందా? అబద్ధం చెప్పి, నన్ను నేను వంచించుకుంటున్నానని అనుకుంటోందా? ఇదా సువర్ణ మనసులో ఉన్నది?

" చూడు సువర్ణా నువ్వు ఆర్ణవ్ ని వెనకేసుకుని రాకు. నా మనసు గురించి నాకు బాగా తెలుసు. నేను తనని ప్రేమించలేదు. అది గుర్తు పెట్టుకో. తను బాగా మాట్లాడుతాడు. మనిషి బావుంటాడు. నేను వద్దన్నా నన్ను పొగుడుతాడు. అందుకని కొంచెం ఆకర్షితురాలనయ్యానేమో. దాన్ని ప్రేమ అనరు. ఇది ఇంకా ముందుకి వెళ్ళకుండా,నా మనసు గాయపడకుండా ముందే జాగ్రత్త పడ్డాను.నువ్వు వంచన అన్నావు, ఇందులో వంచన ఏం ఉంది? నేనేం ఆర్ణవ్ వెంట పడలేదే! ప్రేమిస్తున్నాని అనలేదే!అతనిచ్చిన బహుమతులు తీసుకోలేదే,సినిమాలూ షికార్లు అంటూ నా వెంట తిప్పుకోలేదే..! నేనేం మోసం చెయ్యలేదే! నీ చుట్టం అని పరిచయం నువ్వు చేసావు.నీతో నా స్నేహం ఎంతో, ఎలాంటిదో,ఆర్ణవ్ తో కూడా అంతే. స్నేహం అంటే స్నేహం లాగా ఉంచాలి.కానీ ప్రేమ అంటే ఎలా!అయినా ఓ అమ్మాయితో చేసిన స్నేహం పెళ్ళితోనే ముగుస్తుందా!స్నేహానికి ముగింపు పెళ్ళా? దానికి ఈ రెండేళ్ళ పరిచయం పెళ్ళికి సరిపోతుందా? " అని అన్నాను.

సువర్ణ అలా ఎందుకు మాట్లాడిందో. ఆమె మనసులో ఏం ఉందో నాకు తెలుసు .తను నన్ను నమ్మడం లేదు.నేను ఆర్ణవ్ ని బాధ పెట్టున్నానని ఆమె అనుకుంటోంది.

ఎంతో ఉత్సాహంగా బయిటికి వెళ్ళిన దాన్ని నిశ్శబ్దంగా ఇంటికి వచ్చాను. బాగా ఆలోచించి ఆర్ణవ్ కి మర్నాడు ఉదయాన్నే అమ్మ గుడికి వెళ్ళినప్పుడు ఫోను చేయాలనుకున్నాను. లేకపోతే ఎవరికి ఫోను చేస్తున్నావు,ఎందుకు చేస్తున్నావ్,అని అడుగుతుంది.

అమ్మ లేదు కాబట్టి ,ధైర్యంగా ఆర్ణవ్ కి చేసాను.

“నువ్వేనా శృతీ!నమ్మలేక పోతున్నాను.ఎంతటి సుదినం! నీతో మాట్లాడడానికి మీ ఇంటికి రెండు సార్లు ఫోను చేసాను.మీ మదర్ తీసారు.ఆ సంగతి నీకు చెప్పలేదా? ఆ సంగతి వదిలెయ్యి,ఇప్పుడు ఫోన్ చేసినందుకు థాంక్స్ ,శృతీ, థాంక్యూ ” సంతోషం,ఉత్సాహం ఆ గొంతులోధ్వనిస్తోంది.

“ నేను నీతో మాట్లాడాలనుకుంటున్నాను.ఆ విషయమే సువర్ణకి చెప్పాను” అన్నాడు

“సరే.ఎక్కడ?” జవాబిచ్చాను ముక్తసరిగా.

“నీ ఇష్టం ఎనీ టైం,ఎనీ ప్లేస్.ఏం సరేనా!చెప్పు ”ఎంతో ఉత్సాహంగా అన్నాడు.

నా గొంతులో ఏదో బాధ. మాటలు రాలేదు.అందుకే ఏం చెప్పలేక పోయాను.వెళ్ళేముందు ఈ మీటింగ్ లు అవీ ఏంటీ.ఆర్ణవ్ తో మాట్లాడడం నాకసలు ఇష్టం లేదు.ఏదో ప్రాధేయ పడుతున్నాడని సరే అన్నాను.

“ సరే అయితే నందిని రెస్టారెంటులో ఈ సాయంత్రం ఐదు గంటలకు,ఓ మూల కూచుని మాట్లాడుకుందాం.” అన్నాను.

“ఓ కే నీ కన్నా ముందే నేనుంటాను ” ఆ గొంతులో ధ్వనించిన తియ్యదనం,మార్ధవం నా కడుపులో దేన్నో కదిలించింది.ఇంక మాట్లాడడానికి ఏం లేదు.

”ఉంటాను” అని పెట్టేసాను.

ఆర్నవ్ అన్నమాట నిలపెట్టుకున్నాడు. నా కన్నా ముందరే వచ్చేసాడు.నన్ను చూడగానే గబ గబా ముందుకు వచ్చి నా కుడిచేతిని అందుకున్నాడు. రెస్టారెంటు లోపలికి వెళ్ళాం. ఓ మూలకి దారి తీసాను.ఇద్దరం ఎదురెదురుగా కూచున్నాం.

“కలవాలని అన్నావు. దేనికి? “ఆశగా నా వైపు చూస్తూ అన్నాడు.

“నేనా , ఆమాట నేననలేదు,నువ్వు అన్నావని, నిన్ను ఓసారి కలవమని సువర్ణ అంటే ..”పూర్తిగా అనలేకపోయాను.

“ అవును అన్నాను.ఉట్టిగానే,చాలా రోజులైంది కదా,పైగా నువ్వు వెళ్ళే సమయం దగ్గర పడుతోంది కదా. అందుకని. ” నా మొహంలోకి పరీక్షగా చూస్తూ అన్నాడు .

నేనేం అనలేదు. తల తిప్పుకున్నాను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS